సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 156 | మంగళవారం, 28 అక్టోబర్ 2025





## మాజీ మంత్రి హరీశ్ రావు

# ఇంటి విషాదం

- వృద్ధాప్యంతో బాధపడుతున్న తండ్రి మృతి

**హైదరాబాద్, మన చౌరాస్తా :** మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణరావు మంగళవారం తెల్లవారు జామున కన్నుమూశారు. ఆయన స్వగ్రామం కరీంనగర్ జిల్లా కొత్తపల్లి. సత్యనారాయణ రావు మృతి పట్ల మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్ ఇతర బీఆర్ఎస్ నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతికి బీఆర్ఎస్ పార్టీ ప్రగాఢ సంతాపం ప్రకటించింది. హైదరాబాద్‌లోని వారి స్వగృహం క్రిన్స్ విల్లాస్‌లో సత్యనారాయణ రావు పార్థివదేహం సందర్శనార్థం ఉంచారు. మంగళవారం మధ్యాహ్నం ఫిల్మ్ నగర్ మహాప్రస్థానం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.



## రైతుల సంక్షేమానికి

# ప్రభుత్వం పెద్దపీట

- **స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ప్రభుత్వాలు ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఒక్క తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ధర్మసాగర్ మండలం ముప్పారం, వేలేరు మండలం పీచర గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కడియం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తూకం విషయంలో, తేమ విషయంలో రైతులను మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడితే ఉపేక్షించవద్దని కఠిన చర్యలు తీసుకోవాలని అవసరమైతే బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులను ఎట్టి పరిస్థితుల్లో ఇబ్బంది పెట్టవద్దని హెచ్చరించారు. రైతులు తేమ 17శాతం లోపు ఉండేలా చూసుకోవాలని అన్నారు. ఐకేపీ నిర్వాహకులు బస్తా 41 కిలోలు మాత్రమే తూకం వేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా క్లినింగ్ మిషన్, మయిస్చర్ మిషన్, త్రాగు నీరు, విద్యుత్ లైట్లతో పాటు ఇతర ఏర్పాట్లు చేయాలని నిర్వహకులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం తడవకుండా సరిపడా టార్పాలిన్ లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. కల్లానికి వచ్చిన ధన్యంలో ఒక్క గింజ కూడా తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వహకులకు సూచించారు. వాతావరణం అనుకూలంగా ఉండడం లేదని కావున రైతులు కూడా అప్రమతంగా ఉండాలని సూచించారు. మహిళలకు ఉపాధి కల్పించాలి, మహిళా సంఘాలను బలోపేతం చేయాలనే ఉద్దేశ్యంతోనే మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ డిఏ, సివిల్ సప్లై డిఎం, అగ్రికల్చర్ ఎడి, తహసీల్దార్, ఎంపిడివో, ఏఈవో, డిపిఎం, ఎపిఎం, మహిళా సంఘాల సభ్యులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైతులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.







# మద్యం షాపుల టెండర్లు పూర్తి

- డ్రా ద్వారా దుకాణాలు కేటాయింపు
- కలెక్టర్ రిజ్వాన్ బాషా చేతుల మీదుగా డ్రా

**జనగామ, మన చౌరాస్తా :** 2025- 27 సంవత్సరానికి జనగామ జిల్లాకు సంబంధించిన మొత్తం 50 మద్యం దుకాణాలకు సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ వేడుకల మందిరంలో డ్రా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా తీసి షాపులో గెజిట్ నెంబర్లను కేటాయించారు. కార్యక్రమంలో జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్, జనగామ ఏఎస్పి పండరీ చేతన్ నితిన్ ఐపిఎస్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కె.అనిత, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రవీణ్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు బి.ప్రభావతి, జి.భాస్కరరావు, బి.సంతోష్ రెడ్డి, ఎక్సైజ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## వనిత టీ స్టాల్ ప్రారంభం

మహిళల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం ప్రారంభించిన ఇందిరా మహిళా శక్తి పథకంలో ఏర్పాటుచేసిన వనిత టీ స్టాల్ లను జిల్లాలో స్వయం సహాయక సభ్యులు విజయవంతంగా నిర్వహిస్తున్నారని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. జనగాం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వనిత టీ స్టాల్ ను, కలెక్టరేట్ బయట పెట్టిన మిల్క్ పార్లర్ ను సోమవారం జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. డిఆర్డిఓ వసంత, అడిషనల్ డిఆర్డిఓ, డిపిఎంలు తదితరులు పాల్గొన్నారు.


## మిల్క్ సెంటర్ ప్రారంభం..

**జనగామ :** చీటకోడూరు లోని కస్తూరి స్వయం సహాయక సభ్యురాలు విజయలక్ష్మి రూ.2.50 లక్షల బ్యాంకు లింకేజి ఋణలతో మిల్క్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ మిల్క్ సెంటర్ కలెక్టర్ రిజ్వాన్ బాషా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్డిఓ వసంత, అడిషనల్ డిఆర్డిఓ, డిపిఎంలు, మున్సిపల్ రిటైర్ ఉద్యోగి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



# వధూవరులను ఆశీర్వదించిన కొమ్మూరి

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కొమురవెల్లి మండలం మర్రి ముస్త్యాల గ్రామానికి చెందిన తురాయి సంగీత - నవీన్ గౌడ్ కుమారుడు తురాయి సాయికుమార్-మన్విత రిసెప్షన్ వేడుక చేర్యాల పట్టణంలోని షణ్ముఖ గార్డెన్స్ లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రిసెప్షన్ వేడుకల్లో పాల్గొన్న జనగామ డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాపరెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, పరస్పర ప్రేమాభిమానాలతో నిండిపోవాలని ఆకాంక్షించారు. కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ మాట్లాడుతూ వివాహం అనేది జీవితంలో అత్యంత పవిత్ర బంధమని వధూవరులు పరస్పర అర్థం, నమ్మకం ప్రేమతో జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంజ మల్లేశం, దాసరి శ్రీకాంత్, జంగని రవి, పుల్లం బిక్షపతి, ఏంటే శ్రీనివాస్, రాకేష్ కృష్ణ, కలర్ శంకర్, మల్లం బాలయ్య, కాగిత శ్రీనాథ్ రెడ్డి, జనగాం శ్రీకాంత్, చెరుకు రమణారెడ్డి, శంకరాచారి, భాస్కర్ రెడ్డి, వినీత్ , బొచ్చు ఎల్లయ్య, చింతల రమేష్ మరియు కొమురవెల్లి, చేర్యాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.






# నూతన ఎంపీడీవోగా శివశంకర్ రెడ్డి

**లింగాలఘణపురం, మన చౌరాస్తా :** గ్రూప్ 1 సర్వీసెస్ ద్వారా కొత్తగా నియామకమైన కె. శివశంకర్ రెడ్డి మండల పరిషత్లో ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ అధికారి ఎన్. రఘురామకృష్ణ, మండల పరిషత్ సూపరిండెంట్ బి.సీ. సీతారాం, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొని కొత్త అధికారిని శాలువా కప్పి ఆహ్వానించారు.

# ఫీజు బకాయిల కోసం ఛలో కలెక్టరేట్



**కొమరవెల్లి, మన చౌరాస్తా:** పెండింగ్లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను వెంటనే కళాశాల యాజమాన్యాలకు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్వీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 29న 'హలో విద్యార్థి చలో కలెక్టరేట్ ' విజయవంతం చేయాలని బిఆర్ఎస్వీ సీనియర్ నాయకులు ఏర్పుల మహేష్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 22 నెలలు అయిన కూడా ఇప్పటి వరకు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. విద్యా శాఖ బాధ్యతలను స్వయంగా చూస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టించుకోకపోవడంతో ప్రైవేటు విద్యా సంస్థలు కుప్పకూలిపోతున్నయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న కాలేజీలు బంద్ పాటిస్తామని యాజమాన్యాలు ప్రకటిస్తే నామమాత్రంగా 600 కోట్లు విడుదల చేస్తున్నామని ప్రకటన చేశారు కానీ ఇప్పటి వరకు ఒక రూపాయి కూడా విడుదల చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో రేవంత్ రెడ్డి చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు.




# దూసరి ధనలక్ష్మికి గోల్డెన్ నంది అవార్డు

**జనగామ, మన చౌరాస్తా :** స్వాతి ఆర్ట్ క్రియేషన్స్ 30వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా గోల్డెన్ నంది అవార్డుల ప్రధానోత్సవం అక్టోబర్ 26న సత్యసాయి నిగమంలో ఘనంగా జరిగింది. 29 సంవత్సరాలుగా ప్రతిభావంతులైన సినీ, టీవీ యూట్యూబ్ కళాకారులను గౌరవిస్తూ గోల్డెన్ నంది అవార్డులను అందించారు. స్వాతి ఆర్ట్ క్రియేషన్స్ ఫౌండర్ & చైర్మన్ గిరిరాజ్ నేతృత్వంలో ఈ సంవత్సరం కూడా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ వేడుకలో శతాబ్ది సంస్థ అధినేత శ్రీనివాస్ రెడ్డి, వాకృతి ఇన్ఫ్రా అధినేత శేషు కుమార్ ప్రత్యేక సహకారం అందించారు. ఈ ఏడాది గోల్డెన్ నంది అవార్డుల వేడుకలో టీవీ సీరియల్లో ఉత్తమ నటనకు, సామాజిక సేవలో విశిష్ట కృషికి జనగామకు చెందిన దూసరి ధనలక్ష్మి అవార్డు అందుకున్నాను. ఈ గుర్తింపుకు ఎంతో ఆనందంగా, కృతజ్ఞతగా భావిస్తున్నానని ఆమె పేర్కొన్నారు.



# రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఏనుమాముల మార్కెట్‌లో సీసీఐ కొనుగోళ్లు ప్రారంభం

**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్‌లోని ఏనుమాముల మార్కెట్ యార్డులో మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, సిసిఐ జనరల్ మేనేజర్ మోహిత్ శర్మ, మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, డిసిఓ నీరజ, కాటన్ కొనుగోలు అధికారి కృష్ణారెడ్డి, వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ... ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామని అన్నారు. రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, మాజీ సీఎం రాజశేఖరరెడ్డి పాలనలో రాష్ట్రం కలకలాడిందని పేర్కొన్నారు. గత పది సంవత్సరాలలో రైతు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, గత ప్రభుత్వం వరి వేస్తే ఉరి అని చెప్పి.. కానీ ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత వరికి బోనస్ ఇచ్చామని అన్నారు. వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, ఎలాంటి



ఇబ్బంది లేకుండా కొనుగోలు చేశామని పేర్కొన్నారు. అదే తరహాలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన కొనుగోలు చేస్తున్నామని అన్నారు. రైతులు నాణ్యమైన పత్తి తీసుకొని వచ్చి మంచి ధరను పొందాలని, కిసాన్ యాప్ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలకు తరలించాలని, యాప్ నిర్ధారించిన సమయం తేదీకి తీసుకొని పోవాలని సూచించారు. సీసీఐకి పత్తి అమ్మితే వారం రోజుల లోపు రైతు ఖాతాలో నగదు జమ అవుతుందని, రైతు సమస్యల కోసం ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశారని, 23 మిల్లుల ద్వారా పత్తి కొనుగోలు చేస్తున్నామని, 12 శాతం లోపు తేమ ఉన్న పత్తిని కొనుగోలు చేస్తామని తెలిపారు. పట్టా పాస్ బుక్ తీసుకొని వస్తేనే కొనుగోలు చేస్తున్నామని, ఎఈవో ద్వారా పత్తి కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.



## మల్లన్న ఆలయంలో కార్తీక దీపోత్సవం

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో కార్తిక దీపోత్సవాన్ని ఆలయ వర్గాలు చేపట్టాయి. ఆదివారం రోజున కార్తీక శుద్ధ పంచమి (నాగ పంచమి) సందర్భంగా స్వామివారి మహా మండపం ఆవరణలో ఐదవ రోజున స్వామివారికి ఉత్సవమూర్తుల ఎదుట సర్వ సూక్త పారాయణము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొమరవెల్లి గ్రామస్తులు మరియు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ బుద్ధి శ్రీనివాస్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నెల్లుట్ల బ్రిడ్జి వద్ద యాక్సిడెంట్

### యువకుడి మృతి

**లింగాలఘణపురం, మన చౌరాస్తా :** లింగాలఘణపురం మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రఘునాథపల్లి మండలానికి చెందిన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కంచనపల్లి గ్రామానికి చెందిన రాగి సంజయ్ (25) బైక్ వెళ్తుండగా.. నెల్లుట్ల బ్రిడ్జి వద్ద లారీ ఢీకొంది. ఈ ఘటనలో సంజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. యువకుడి మృతితో కంచనపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.





## ఘనంగా అమరవీరుల వారోత్సవాలు

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** మండలంలోని ఐనాపూర్, రాంసాగర్ గ్రామాల్లో అమరవీరుల వార్షికోత్సవ సైకిల్ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై రాజు మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు గురించి అన్ని రకాలుగా మేము అందుబాటులో ఉంటామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై రాజు, రామ్ సాగర్, విఆర్ఓ హరీష్, ఏఎస్ఐ సత్యనారాయణ, పిసి స్వాతి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### చేర్యాలలో పోలీసుల సైకిల్ ర్యాలీ

చేర్యాల, మన చౌరాస్తా : చేర్యాల పట్టణ కేంద్రంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఫ్లాగ్ డే కార్యక్రమంలో భాగంగా చేర్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్. శ్రీను, ఎస్సై వి. నవీన్ మరియు పోలీస్ సిబ్బంది వివిధ స్కూలు విద్యార్థులతో కలిపి సైకిల్ ర్యాలీ నిర్వహించారు.



## హనుకొండ ప్రజావాణికి 112 వినతులు

**హనుమకొండ, మన చౌరాస్తా :** ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై అందించిన వినతులను త్వరగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు విన్నవిస్తూ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లకు వినతులను అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి వినతులను స్వీకరిస్తూ సమస్యలపై వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజల నుండి 112 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో డిఆర్వో వై.వి. గణేష్, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, జిల్లా అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.




## ఆర్టీసీ బస్సుకు తప్పిన పెను ప్రమాదం

**భీమదేవరపల్లి, మన చౌరస్తా:** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ బస్టాండ్ లో వరంగల్ వన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుకు త్రుటిలో పేరు ప్రమాదం తప్పింది. విరాలకు వెళ్తే సిద్దిపేట నుండి హనుమకొండ కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బస్టాండ్ లో ప్రయాణికులను ఎక్కాక బస్సు బయటకు వెళ్లే క్రమంలో జాతీయ రహదారి పనుల్లో భాగంగా నిర్మించిన డ్రైనేజీ బ్రిడ్జి ఎత్తుగా ఉండడం నేషనల్ హైవే అపాచీ అధికారులు మట్టి పోసి రైలింగ్ సరి చేయకపోవడం అదేవిధంగా ఆర్టీసీ అధికారులు శాశ్వత పనులు చేపట్టకపోవడంతో ఆ ఎత్తు తక్కువ ఉండడం వల్ల ఆర్టీసీ బస్సుల రాకపోకల సందర్భంగా ఫుట్ రెస్ట్ లకు తరచూ ప్రమాదం జరుగుతూ ఉండేది.TS25Z0022 నెంబర్ గల ఆర్టీసీ బస్ హనుమకొండ వైపు బస్టాండ్ వెలుపలకు వస్తున్న క్రమంలో ఫుడ్ రెస్ట్ తగిలి వెనుకకు వచ్చి



ఒకేసారి టైర్ పేలిపోవడం జరిగింది. రేడియల్ టైర్ కావడంతో బస్సు కుదుపు గురి అయ్యి పెనుప్రమాదం తప్పింది. టైరు పేలడంతో పక్కనే ఉన్న చిరు వ్యాపారుల దుకాణాల్లో రాళ్లు ఎగిరి పడ్డాయి ఒకవేళ బస్సు వేగంగా ఉండి ఉంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో సుమారు 100 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు.



# జూబ్లీహిల్స్‌లో గెలుపు మాదే..

■ **పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**

**హైదరాబాద్, మన చౌరాస్తా :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు తపనగా కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి బోరాబండా డివిజన్ పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు, మైనారిటీ నేతలు, యువజన కాంగ్రెస్ సభ్యులు భారీగా పాల్గొన్నారు. ప్రతి వీధిలో ప్రజలను కలుస్తూ, అభ్యర్థి నవీన్ యాదవ్ అభివృద్ధి దృష్టి, ప్రజా సంక్షేమానికి ఆయన కట్టుబాటు గురించి వివరించారు. బోరాబండ ప్రాంతంలోని ముస్లిం సోదరులు ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని ఆత్మీయంగా ఆహ్వానించి, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ వారి నేతృత్వంలో తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు ప్రజల గెలుపు ఖాయమని అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతోందని అన్నారు. ఈ అభివృద్ధి యాత్ర కొనసాగాలంటే నవీన్ యాదవ్ గారిని గెలిపించాలి అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ నవీన్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రజల ఆశయాలను నెరవేర్చే బాధ్యత నాపై ఉంది. జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతాను. రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా కృషి చేస్తాను అని తెలిపారు. ప్రచార కార్యక్రమంలో బోరాబండా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు, బూత్ స్థాయి నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## టీఆర్పీ జనగామ జిల్లా అధ్యక్షురాలిగా
# చెరుకూరి మౌనిక యాదవ్



**జనగామ, మన చౌరాస్తా :** బీసీల రాజ్యాధికారం కోసం ఏర్పడిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ జనగామ జిల్లా అధ్యక్షురాలిగా చెరుకూరి మౌనిక యాదవ్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన పార్టీ అధ్యక్షులు తీన్మార్ మల్లన్న, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్స్ సుదగాని హరి శంకర్ గౌడ్, మాదం రజిని కుమార్ యాదవ్, పార్టీ ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ పల్లెబోయిన అశోక్ ముదిరాజ్, పార్టీ రాష్ట్ర కార్యవర్గానికి ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో ఇచ్చిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

# పాలకుర్తి నూతన ఎంపీడీవోగా వేదవతి



**పాలకుర్తి, మన చౌరాస్తా :** పాలకుర్తి కొత్త ఎంపిడీవోగా సోమవారం వి.వేదవతి బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో నూతనంగా చార్జ్ తీసుకున్న ఆమెకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించారు. కార్యక్రమాల్లో నాసం సందీప్, సముద్రాల రవీందర్, కమ్మగాని ఉమా మహేష్ కుమార్ గౌడ్, ఏనుగుతుల అశోక్, గ్రామపంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# గురుకుల విద్యార్థిని మృతిపై ప్రభుత్వం స్పందించాలి

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర బాలికల గురుకుల పాఠశాలలో అక్టోబర్ 24న పదవ తరగతి విద్యార్థిని శ్రీ వర్షిత ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన ఘటనపై హుస్నాబాద్ నియోజకవర్గ బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు సోమవారం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జేఏసీ నాయకుడు సదన్ మహరాజ్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లలో తరచుగా జరుగుతున్న విద్యార్థుల మృతులపై ప్రభుత్వం కేవలం కంటి తుడుపు చర్యలకే పరిమితమవుతుందన్నారు.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అలాగే ఈ సంఘటన జరిగి నాలుగు రోజులు అయినా స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ పాఠశాలను సందర్శించకపోవడం దారుణమన్నారు. ఇటీవల హుస్నాబాద్ గురుకుల పాఠశాలలో కూడా ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం, ఇప్పుడు వంగరలో మరొక విద్యార్థిని మృతి చెందడం అత్యంత బాధాకరం" అని పేర్కొన్నారు. వర్షిత మృతికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థిని కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని" సదన్ మహరాజ్ డిమాండ్ చేశారు.





# ప్రజా గ్రంథాలయానికి విరాళం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో నెలకొల్పబడిన ముల్కనూర్ సాహితీ పీఠం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రజా గ్రంథాలయానికి రిటైర్డ్ ఎస్పీ నారాయణ సోమవారం నాడు లక్ష రూపాయల విరాళం అందించారు. ప్రజా గ్రంథాలయం నిర్వాహకులు, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాస్కు చెక్కును స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, ముల్కనూర్ సాహితీ పీఠం ద్వారా కవులను, సాహిత్యసేవకులను ప్రోత్సహించడం సమాజానికి ఆదర్శమని అన్నారు. ప్రజా గ్రంథాలయం ద్వారా విద్యార్థులు పఠనాసక్తిని పెంపొందించుకుని ప్రభుత్వ ఉద్యోగాలలో అవకాశాలు సాధిస్తున్నారని అభినందించారు. నిర్వహణ కమిటీ అంకితభావాన్ని ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి, శంకర్రావు, శ్యాంసుందర్, డాక్టర్ రాజ శ్రీనివాస్, కే. సుగుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీసోమేశ్వరాలయంలో కార్తీక దీపోత్సవం

**పాలకుర్తి, మన చౌరాస్తా :** జనగామ జిల్లా పాలకుర్తిలోని శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా తొలి సోమవారం కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. మహిళలకు తాంబూలం, ప్రసాదం వాయినంగా అర్చకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ సల్వాది మోహన్ బాబు, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, ఆలయ ప్రధాన అర్చకులు దేవగిరి లక్ష్మన్న, డీవీఆర్ శర్మ, దేవగిరి అనిల్ కుమార్, మత్తగజం నాగరాజు, సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల ప్రారంభం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ సొసైటీ ఆధ్వర్యంలో ముల్కనూర్ మల్లారం గ్రామాల్లో వడ్లు పత్తి, కొనుగోలు కేంద్రాలను జిల్లా సహకార అధికారి సంజీవ రెడ్డి సోమవారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సకాలంలో పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ముల్కనూర్ సొసైటీ సహకార రంగంలో రైతులకు ఆదర్శంగా నిలుస్తూ వ్యవసాయాన్ని పండుగ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జనరల్ మేనేజర్ యం. రాం రెడ్డి,వ్యవసాయ అధికారి పద్మ, ఏఈఓ సుమలత, సంఘ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సతీష్, మిల్లు మేనేజర్ అభిలాష్ రెడ్డి మరియు రైతులు పాల్గొన్నారు.



# లాటరీ పద్ధతిన మద్యం షాపుల కేటాయింపు

■ **67 మద్యం షాపులకు డ్రా తీసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**హనుమకొండ, మన చౌరాస్తా :** వరంగల్ అర్బన్ జిల్లా పరిధిలోని 67 మద్యం షాపులకు లాటరీ డ్రాను సోమవారం తీశారు. హనుమకొండలోని అంబేద్కర్ భవన్ లో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు మద్యం షాపుల కేటాయింపునకు సంబంధించి లాటరీ డ్రాను తీసేందుకు ఏర్పాట్లు చేయగా హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ హాజరై డ్రా తీశారు. 67 మద్యం షాపులకు గాను 3175 దరఖాస్తులు రాగా లాటరీ పద్ధతిన డ్రాను తీశారు. ఒక్కో మద్యం దుకాణానికి సంబంధించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సమక్షంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ డ్రా తీసి సంబంధిత నెంబర్ ను ప్రకటించారు. మద్యం షాపుల కేటాయింపునకు సంబంధించి లాటరీ పద్ధతిన డ్రా లో కేటాయించబడిన అభ్యర్థికి కేటాయింపు పత్రం ఎక్సైజ్ అధికారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ అంజన్ రావు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఎక్సైజ్ శాఖ సిఐలు,ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.